క్లుప్తంగా

క్షయ రహిత సమాజమే లక్ష్యం

నింద్ర: క్షయ రహిత సమాజమే మన లక్ష్యంగా తయారు చేయాలని వైద్యాధికారి సుమలత అన్నారు. గురువారం వైద్యశాలలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ క్షయ వ్యాధిని అంతం చేయ డానికి అందరు కృషి చేయాలని కోరారు. చాలా రోజులు దగ్గు వస్తుంటే పరీక్షలు చేసుకో వాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజ లకు ఏఎన్ఎంలు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వినీషా, హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్ఓ శ్రీదే వి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ చైర్మన్ సేవలు అభినందనీయం


సిద్ధమవుతున్న క్రీడా మైదానం

కార్వేటినగరం: పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు సేవలు అభినందనీయమని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం నాదముని రెడ్డి అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గురువారం పాఠశాల చైర్మన్ త్యాగరాజు తన సొంత నిధులతో క్రీడా మైదా నంలోని పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ చైర్మన్‌గా పాఠశాల అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తున్న త్యాగరాజును కొనియాడారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదవ సంఘంలో పుత్తూరు నాయకులు


అన్నా లోకనాథం

పుత్తూరు: తెలుగు యాదవ మహాసభ రాష్ట్ర అధికార ప్రతినిధిగా స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకుడు అన్నా లోక నాథం నియమితుల య్యారు. నగరి నియోజక వర్గ సంఘ అధ్యక్షుడుగా చిరంజీవియాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోన గురవయ్య యాదవ్ గురు వారం ఉత్తర్వులు జారీ చేశారు.

దేశభక్తి, ఐక్యతా భావం పెంపొందించుకోవాలి


నగరిలో హరఘర్ తిరంగా ర్యాలీ

నగరి: దేశభక్తి, ఐక్యతా భావం విద్యార్థుల్లో నిం డాలని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ అన్నారు. గురువారం విద్యార్థు లతో కలిసి ఆయన హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత జాతీయ పతాకం దేశ సార్వభౌమాధికారానికి, ఐక్యతకు, సమగ్రతకు చిహ్నమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భాస్కర రాజు, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ అధికారి గోపి, అధ్యాపకులు రామాంజులు, హరి, కిరణ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చిత్తూరు మార్కెటింగ్ శాఖ అధికారి ఇందుమతి తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా గురజాల జగన్ మోహన్, చైర్మన్‌గా ఝాన్సీరాణి, వైస్ చైర్మన్‌గా అనురాధ, సభ్యులుగా రామమూర్తి, గంజినా యుడు, రాణి, నందిని, నాగరాజన్, జయపా లన్, సయ్యద్ ఫిరోజ్, హేమచంద్ర, అంజలి, మీనాక్షి, గౌరి, గోవిందస్వామి నాయుడు, మోహ న్‌నాయుడులను నియమించిందన్నారు. ఉత్త ర్వులు గురువారం కార్యాలయానికి అందాయ న్నారు. త్వరలో కమిటీ ప్రమాణ స్వీకారం ఉం టుందని ఆమె పేర్కొన్నారు.

79 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ


జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిత్తూ రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం తుమ్మింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం 79 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిం చారు. గ్రామవీధుల్లో జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టి భారత్ మాతాకీ జై నినాదాలతో హోరెత్తించారు. విద్యార్థులలో దేశభక్తిని పెం పొందించడానికి 79వ స్వాతంత్ర్య దినోత్స వాన్ని పురస్కరించుకొని 79 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీని నిర్వహించామని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని వసం తలక్ష్మి తెలిపారు. ఈ ర్యాలీలో పాఠశాల ఉపా ధ్యాయులు లలిత, అమర్‌నాథ్, జ్ఞాన దీపం, జయమణి, శంకర్ నాయక్, మునీర్, కాళప్ప, రమాదేవి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో.. అతిసారం దూరం

అతిసారం(నీళ్ల విరేచనాలు) లేదా డయేరి యాగా పిలిచే ఈ వ్యాధి వైరస్‌తో వస్తుంది. కొన్ని రకాలైన బ్యాక్టీరియా ద్వారా కూడా అతిసార వ్యాధి రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం మనిషి రోజులో మూడు లేక అంతకంటే ఎక్కువ సార్లు వదులుగా విరేచ నాలు చేసుకుంటే దానిని అతిసార అంటారు. ఐదేళ్లలోపు పిల్లల్లో జరిగే మరణాలకు అతి సార వ్యాధి రెండో ప్రధాన కారణం. డయే రియా అతి భయంకరమైన వ్యాధి కాకపో యినా దీని కారణంగా చాలా మరణాలు కూడా సంభవిస్తున్నాయి. చిన్న జాగ్రత్తలతో కూడా డయేరియాను నివారించుకోవచ్చు. కొద్దిపాటి ప్రాథమిక వైద్యంతో కూడా ప్రాణ హాని జరగకుండా కాపాడుకోవచ్చు.

–కార్వేటినగరం

- వాతావరణ మార్పులతో లక్షణాలు
- వైద్య సూచనలు పాటించాలంటున్న నిపుణులు



కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

సీజన్ మారినప్పుడు లేదావర్షాలు కురుస్తున్న ప్పుడు జ్వరం, దగ్గు జలుబు తదితర రోగాలు వస్తాయి. ఈ క్రమంలో వాతావరణంలో మార్పులు తాగునీరు కలుషితం కావడం, ఇతర వైరస్‌లు గాలి ద్వారా వ్యాపించడం, ఈగలు, దోమలు సైతం విజృంభిస్తుండడం కూడా వ్యాధి కారకాలుగా మారుతున్నాయి. డయేరియా అనేది చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ అన్ని వయ స్సుల వారికి వచ్చే వ్యాధి. ఈ కాలంలో ఎక్కువ మంది పిల్లలు దీని బారిన పడుతుంటారు. అందుకే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

డయేరియా రకాలు

అతిసార వ్యాధిలో రెండు రకాలున్నాయి. ఒకటి నీళ్ల విరేచనాలు. దీన్నే నార్మల్ డయేరియా అంటారు. రెండోది రక్త బంకతో వచ్చే విరేచనాలు దీన్ని డీసెంట్రీ అంటారు. పిల్లల్లో వచ్చే డయేరియాకు రోటా వైరస్, పెద్ద వాళ్లల్లో డయేరియాకు నోరఫ వైరస్‌లు కారణం. ఇవే కాకుండా రకరకాల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, బ్యాక్టీరి యాలు, జీర్ణవ్యవస్థ దెబ్బతినడం, ఫుడ్‌పాయిజనింగ్ కూడా డయేరియాకు కారణమవుతాయి. డయేరియా సోకినప్పుడు శరీరంలో నీటి శాతం, లవణాలు తగ్గి పోయి నీరసంగా తయారవుతారు. ఆ సమయంలో శరీరానికి సరిపడా లవణాలు అందించకపోతే డీ హైడ్రేషన్ ఎక్కువయై పరిస్థితి ప్రమాదకరంగా మారు తుంది. అందుకే డయేరియాను వెంటనే గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రమాద సమయం

కొద్దిపాటి విరేచనాలకు ప్రమాదం ఏమీ జరగదు. విరేచనాలు ఎక్కువగా అయ్యి శరీరంలోని నీటి శాతం ఎక్కువగా తగ్గి, బీపీ తగ్గి శరీర భాగాలకు ప్రధానంగా మూత్రపిండాలు, మెదడుకు రక్తప్రస రణ తగ్గినప్పుడు ప్రాణహాని జరుగుతుంది. ప్రధాన లవణాలైన సోడియం, పొటాషియంలు తగ్గిపోయి తీవ్రమైన బలహీనతకు గురై అపస్మారక స్థితిలోకి చేరుకునే అవకాశం ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే తొందరగానే ఈ అనారోగ్యం నుంచి బయటపడొచ్చు.

తీసుకోవాల్సిన

నీళ్ల విరేచనాలతో శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి పునరుద్ధరించాలంటే గ్లూకోజ్, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి. ఎలక్ట్రాల్ పొడి కలిపిన నీళ్లు, కొబ్బరినీళ్లు, నిమ్మరసం తాగితే శరీరంలో కోల్పోయిన లవణాలను తిరిగి పొందుతుంది. విరే చనాలతోపాటు వాంతులు కూడా అవుతుంటే సెలైన్ ఎక్కించాల్సి రావచ్చు. తగినంత విశ్రాంతి తీసుకుంటూ డాక్టర్లు సూచించిన మందులు వాడితే వాంతులు, విరేచనాలు తగ్గుతాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- రక్షిత మంచినీరు, కాచి చల్లార్చిన నీటిని తాగాలి
- చేతి గోళ్లు పెంచుకోకూడదు
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి
- తేలిగ్గా అరిగే పదార్థాలను తినాలి
- తినే ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



అతిసార వ్యాధి రాకుండా చర్యలు తీసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలను పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం. ఇప్పటికే పలు గ్రామాలను సందర్శించి, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని అవగాహన కల్పించాం. ఇప్పటి వరకు ఎటువంటి అతిసార వ్యాధి కేసులు నమోదు కాలేదు. అతిసార వ్యాధి నివారణకు అవసరమైన చికి త్సను పీహెచ్‌సీలో నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ భువనేశ్వరి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, కత్తెరపల్లి

గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలించండి

నింద్ర: వర్షాకాలం కారణంగా ప్రజలు అతిసార, డయేరియా వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శులు పరి శీలించి, చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శివప్రసా ద్‌వర్మ అన్నారు. గురువారం మండల కార్యాల యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పంచాయతీల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంక్‌లో నీటిని నిలిపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసి, నీరు సర ఫరా చేయాలన్నారు. ప్రతి ఒక్కరు గ్రామాల్లో పరి సరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలపై శ్రద్ధ పెట్టాలి


పిల్లల బరువు, ఎత్తులను చెక్ చేస్తున్న జయశ్రీ

పాలసముద్రం: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ తెలిపారు. గురువారం పాలసముద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. పిల్ల లకు మధ్యాహ్న భోజనం మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు, బాలింతలకు ఇస్తున్న గుడ్లు పంపిణీ, రికార్డులను పరిశీలించారు. అనంతరం పిల్లల బరువు, ఎత్తుని కొలతలు తీసి, ఆన్‌లైన్‌లో పెట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆయా పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి అవమానం


మాట్లాడుతున్న గురవారెడ్డి

- దొంగ ఓట్లుతో గెలిచిన టీడీపీ

శ్రీరంగరాజపురం: పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికలను ప్రజాస్వామ్యం తల దించుకునేలా దొంగఓట్లుతో నిర్వహించడంతో టీడీపీ గెలిచిందని, న్యాయబద్ధంగా ఎన్నికలు జరగ లేదని వైఎస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురవా రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఎన్నడు లేని విధంగా దౌర్జన్యం, దాడులతో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. జెడ్పీటీసీ స్థానం కోసం ముఖ్యమంత్రి చంద్రబా బునాయుడు ఏకంగా ఏడుగురు మంత్రులను మం డలంలో మోహరించారంటే.. వైఎస్ఆర్ సీపీ బలాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. ఎంపీపీ సరిత జనార్దన్, జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, నియోజకవర్గం సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మణి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్, నాయకులు హరిరెడ్డి, సతీష్, సుబ్రమణ్యం తదిత రులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు ప్రత్యేక ఏర్పాట్లు


తిరుమలరాజుపురంలో సిద్ధమవుతున్న జెండా దిమ్మె


ఆముదాల హైస్కూల్‌లో అలంకరణ పనులు

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ కార్యా లయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేశామని గురు వారం ఎంపీడీఓ విద్యావతి, ఎంఈఓ రాజేంద్రప్ర సాద్ తెలిపారు. తిరుమలరాజుపురం హెచ్ఎం మురళీకృష్ణ, ఆముదాల హెచ్ఎం శేషాద్రి ఆధ్వర్యం లో విద్యార్థులు పాఠశాలల అలంకరణ కార్యక్ర మాన్ని పూర్తి చేశారు. విద్యార్థులకు పలు క్రీడాపో టీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి శుక్ర వారం నిర్వహించే వేడుకల్లో బహుమతులు అంది స్తారని తెలిపారు.

ఆడబిడ్డ నిధికి మంగళం పాడిన కూటమి


కృపాలక్ష్మి

పాలసముద్రం: ఆడబిడ్డ నిధి ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ పథకాన్ని అమలు చేమకుండా మోసం చేస్తున్నాడని జీడీ నెల్లూరు ఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి మం డిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెన్నాయుడు గతంలో చెప్పిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అధి కారం చేపట్టగానే అమలు చేయలేమని బహిరంగం గా చెప్పడం వారి దిగజారుడు రాజకీయానికి నిద ర్శనమన్నారు. పూర్తి స్థాయిలో పథకాలు అమలు చేయకున్నా. ఏడాదిన్నరకే రూ.లక్ష కోట్లు పైబడి అప్పులు ఎందుకు చేశారో రాష్ట్ర ప్రజ లకు చెప్పాలన్నారు. హామీలు ఇచ్చే ముందు వాటిని అమలు చేయలేమని తెలియదా చంద్రబాబు అంటూ ఆమె ప్రశ్నించారు. నేడు ప్రారంభిస్తున్న శ్రీశక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో కూడా మహిళలకు కొర్రీలు వేశాడని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం ఇచ్చిన హామీలన్నీ ఐదేళ్ల పాటు అమలు చేశారని గుర్తు చేశారు. మహిళలపైకూటమి నేతలు ఎంత క్రూరం గా ప్రవర్తిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దల్లో మార్పు రావాలని. కక్ష సాధింపు చర్యలు మాని పరిపాలన, ప్రజలకు రక్షణ కల్పించడంపై దృష్టి సారించాలని సూచించారు. లేని పక్షంలో ప్రజల్లో తిరుగుబాబు వస్తుందని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

గంగాధరనెల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని గంగాధరనె ల్లూరు వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు అంతా అధికార పార్టీతో కుమ్మక్కయ్యారని అన్నారు. మీడియా ప్రతినిధు లకు కూడా అనుమతి ఇవ్వలేదంటే అక్కడ ఏ విధం గా ఎన్నికలు జరిగాయో అర్థం చేసుకోవచ్చున్నారు. దొంగ ఓట్లు వేసిన వారిని విచారిస్తే అసలు కుట్రదా రులు, సూత్రధారులు, అక్రమార్కులు ఎవరో తెలి సిపోతుందన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి

పాలసముద్రం: మండల పరి ధిలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు తప్పకుండా సమ యపాలన పాటించాలని మండల ప్రత్యేక అధికారి వెం కటరమణ తెలిపారు. గురు వారం పాలసముద్రం గ్రామ సచివాల యాన్ని ఆయన ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సాయంత్రం 5 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పలు సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి సమస్యలను అర్జీ రూపంలో తీసుకు న్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం రికార్డులు తరవుగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ గిరిజ, డిజిటల్ అసిస్టెంట్ శివ, గ్రామ సర్వేయర్ అల్లీ పాల్గొన్నారు.

వేడుకగా హర్‌ఘర్ తిరంగా



పుత్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఆర్ఎస్ విద్యార్థులు

పుత్తూరు: స్వాతంత్ర ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని, ఇందుకు ఐకమత్యమే మార్గమని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చం ద్రమౌళి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యం లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గతంలో జాతీయ జెండాను ప్రభుత్వ భవనాలపైనే ఎగుర వేసే వారమని, ప్రధానమంత్రి పిలుపు మేరకు ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగుర వేయాలని కోరారు. తద్వారా ప్రజల్లో దేశభక్తి, ఐక్యమత్యం పెంపొందు తుందని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో త్రివర్ణ పతాకాలు చేతపట్టి, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారి కె.శ్రీనివాసులు, బాబూరావు, ఐక్యూ కో–ఆర్డినేటర్ సుజన, నాగేశ్వరరావు, తిరుమలయ్య, గంగయ్య, జ్యోతి పాల్గొన్నారు.

కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో కలపాలి


సంతకాలు సేకరిస్తున్న యువత

కార్వేటినగరం: కార్వేటినగరం మండలాన్ని తిరుప తిలో చేర్చాలని గురువారం యువత సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా యువత మాట్లా డుతూ భౌగోళికంగా తిరుపతికి సమీపంలో ఉన్న కార్వేటినగరం మండలాన్ని ఆ జిల్లాలోనే చేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వెదురుకుప్పం, కార్వే టినగరం మండలాలు తుడా పరిధిలో ఉన్నాయని గుర్తు చేశారు. 35 కిలో మీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి నిత్యం మండలం నుంచి సుమారు 5 వేల మందికి పైగా విద్యార్థులు, ప్రయాణికులు, ఉద్యోగరీత్యా ఉద్యోగులు రాకపోకలు సాగిస్తు న్నారని పేర్కొన్నారు. ఇలాంటి వాటిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలని డిమాండ్ చేశారు. గతంలో సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ పర్యటనలో భాగంగా కార్వేటినగరంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో కూడా కార్వేటినగరం, వెదురు కుప్పం మండలాలను తిరుపతిలో చేరుస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మండల వ్యాప్తంగా సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటకృష్ణ, సుదర్శన్, దేవరాజులు, షణ్ముగం, జయంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- వైభవంగా ధ్వజారోహణం
- ఆకట్టుకునే విధంగా విద్యుత్ దీపాల ఏర్పాటు


ధ్వజారోహణలో భాగంగా గణపతి యాగం


విద్యుత్ దీపాలతో సుందర అలంకరణ


ప్రత్యేక అలంకరణలో శ్రీవళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారు

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమార గిరిపై వెలసి ఉన్న శ్రీవళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వార్షిక ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమ య్యాయి. వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు అభిషేకాలు నిర్వ హించారు. అనంతరం ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేపట్టి, ఆడికృత్తిక ఉత్సవాలకు సకల దేవత లను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ధ్వజారోహణ కార్యక్రమానికి ఎంపీపీ లతాబాలాజీ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం శ్రీవళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివా ర్లను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభర ణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నేడు భరణి కృత్తిక

ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 15వ తేదీ శుక్ర వారం భరణి కృత్తికను పురస్కరించుకుని దూపదీప నైవే ద్యం, భరణి అభిషేకం చేపట్టనున్నారు. సాయంత్రం శ్రీవళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారు ప్రత్యేక వాహ నంపై గ్రామ వీధుల్లో విహరించనున్నారు. 16వ తేదీ శని వారం ఆడికృత్తిక మహాభిషేకం జరుగుతుంది. కావిళ్లతో భక్తులు మొక్కులు తీర్చుకుని, స్కంధ పుష్కరిణిలో నిర్వహించే తెప్పోత్సవాలను తిలకించవచ్చు. గ్రామోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమానికి పద్మసరస్సు గిరిజనులు ఉభయ దారులుగా వ్యవహరించనున్నారు. 17వ తేదీ ఆది వారం నిర్వహించే ఆడికృత్తిక వేడుకలకు తూర్పు శివా లయం గిరిజన కులస్తులు ఉభయదారులుగా వ్యవహరి స్తారు. 18వ తేదీ సోమవారం నిర్వహించే ఆడికృత్తిక వేడుక లకు చింతతోపు ఎస్టీ కాలనీవాసులు ఉభయదారులుగా వ్యవహరిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఎండో మెంట్ ఈఓ కృష్ణనాయక్ తెలిపారు.

ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలు

వార్షిక ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకుని చిత్తూరు–పు త్తూరు జాతీయ రహదారి ఆనుకుని కుమారగిరిపై ఉన్న శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ప్రధాన కూడళ్లలో స్వామివారి ప్రతిమలతో కూడిన భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. స్కంధ పుష్కరిణి చుట్టూ, పుష్కరిణిలోని నీరాళి మండపాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా తీర్చి దిద్దారు.